
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సంగారెడ్డి 5 మెదక్

జిల్లాల వార్తలు

మంగళవారం 28 జనవరి 2025



20వ వార్డు ఇన్‌చార్జి అధికారిగా దరఖాస్తులు స్వీకరణలో వ్యక్తి (ఫైల్)

సంగారెడ్డి మున్సిపల్ పాలకవర్గ వీడ్కోలు సమావేశంలో నిర్మలాజగ్గారెడ్డి

- చైర్‌పర్సన్, కౌన్సిలర్లను అభినందించిన టీజీఐఐసీ చైర్‌పర్సన్
- నిర్మలాజగ్గారెడ్డిని పార్టీలకతీతంగా సన్మానించిన పాలకవర్గసభ్యులు





టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డిని సన్మానిస్తున్న మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డితో కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు



నిర్మలాజగ్గారెడ్డితో కౌన్సిలర్ కూన వనితాసంతోష్ దంపతులు

సంగారెడ్డి టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి మున్సిపల్ పాలకవర్గ సభ్యుల వీడ్కోలు సమావేశానికి టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మీరవి దంపతులు, కమిషనర్ ప్రసాద్‌చౌహాన్‌తో పాటు పలువురు కౌన్సిలర్లు పార్టీలకతీతంగా ఘనంగా సన్మానించారు. ఈ మేరకు నిర్మలాజగ్గారెడ్డి మాట్లాడుతూ కౌన్సిలర్లు రాజకీయాలకతీతంగా పట్టణాభివృద్ధి కోసం కృషి చేశారని అభినందించారు. తాను కొన్నిరోజులు కౌన్సిలర్‌గా ఉండి ప్రజాసంక్షేమం, పట్టణాభివృద్ధి కోసం కృషి చేశానని తెలిపారు. పట్టణాభివృద్ధికి సహకరించిన చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మీరవి, కౌన్సిలర్లు, అధికారులకు అభినందనలు తెలియజేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కూన వనిత, షేక్ షఫీ, జీవీ వీణ, ఉమామహేశ్వరీ, వెంకట్‌రాజు, సాబేర్, సమీ, ఉదయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఒకరి స్థానంలో మరొకరు విధుల్లో

- ఏకంగా ఇన్‌చార్జి వార్డు ఆఫీసర్‌గా హాజరు
- మెదక్ బల్దియాలో వింత పోకడ

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : మెదక్ మున్సిపాలిటీలో ఒకరి స్థానంలో మరొకరు విధులు నిర్వహిస్తూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. అనారోగ్యం సాకుతో కొందరు వారి కుటుంబసభ్యులను విధుల్లోకి పంపుతున్నారు. జీతం పొందేది ఒకరైతే పనుల్లో మాత్రం ఇతర వ్యక్తులను ఏర్పాటు చేసుకుంటున్నారు. మెదక్ మున్సిపాలిటీలో ఇలా సుమారు 15 మందికిపైగా ఉన్నారు. వారంతా వాటర్ సప్లై, శానిటేషన్ విభాగాల్లో పనిచేస్తుండగా అందులో ఒకరిని ఏకంగా వార్డు అధికారిగా నియమించారు.

మెదక్ మున్సిపాలిటీలో ఓ మహిళ అటెండర్‌గా ఉండగా, ఆమె బదులు కుమారుడు విధులు నిర్వహిస్తున్నాడు. ఆయన్నే ఓ వార్డుకు అధికారిగా కూడా నియమించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన వార్డుసభలలో సైతం అతడే విధులు నిర్వహించాడు. ప్రజలు ఇచ్చిన దరఖాస్తుల్లో సైతం సంతకాలు చేసి తీసుకోవడం గమనార్హం. ఇతర మున్సిపాలిటీల్లో ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని మాత్రమే వార్డు అధికారిగా విధులు కేటాయిస్తుండగా, ఇక్కడ మాత్రం ఏకంగా బదిలీ వర్కర్‌కు వార్డు కేటాయింపు చేయడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలా మెదక్ మున్సిపల్ పరిధిలో నిబంధనలను తుంగలో తొక్కి ఒకరికి బదులు మరొకరు విధులు నిర్వహిస్తుండడం బహిరంగ రహస్యమే అయినా చర్యలు తీసుకోవడం లేదు. మున్సిపల్ పాలకవర్గం గడువు ముగియడంతో సోమవారం నుంచి ప్రత్యేక అధికారి పాలన కొనసాగుతుంది. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మెంచు నగేష్ అయినా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న సిబ్బంది తీరుపై దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు. జీతం ఒక చోట, పనులు మరోచోట చేసేవారిపై కూడా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్‌ను సంప్రదించగా మరొకరి స్థానంలో వచ్చి వార్డు అధికారిగా ఉన్న వ్యక్తిని తొలగిస్తున్నట్లు చెప్పారు.



వార్డు అధికారిగా షమిన్ ఫాతిమా పేరు

బీజేపీ మెదక్ జిల్లా సారథి ఎవరో?

- ముఖ్య నాయకులతో ఓటింగ్
- ఎన్నిక ఫలితం షీల్డుకవర్‌లో అదిష్ఠానానికి
- వారంలో ప్రకటించే అవకాశం

నర్సాపూర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : గతంలో ఎప్పుడు లేనంతగా ఈసారి బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్ష పదవికి తీవ్ర పోటీ నెలకొన్నది. ఈసారి ఓటింగు ద్వారా అధ్యక్షుడిని ఎన్నుకోగా ఆ ఫలితాలు ప్రస్తుతం అదిష్ఠానం చేతిలో షీల్డు కవర్‌లో నిక్షిప్తం అయ్యాయి. బీజేపీ సంస్థాగతంగా గ్రామ, మండల అధ్యక్షులతో పాటు జిల్లా అధ్యక్షులను నియమిస్తున్నది. మెదక్ జిల్లా సారథిని నియమించేందుకు రాష్ట్ర కమిటీ కసరత్తు చేయగా, జిల్లాలోని ముఖ్య నేతలు సుమారు 20 మంది వరకు ఆ పదవిని ఆశించారు. పార్టీలో అంతర్గతంగా సాగిన ప్రయత్నాలతో చివరకు ముగ్గురు మిగిలారని తెలిసింది. అందులో మెదక్ ప్రాంతానికి చెందిన ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, నర్సాపూర్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రఘువీరారెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.చిన్నరమేష్‌గౌడ్ మిగిలారు. వీరు ఎవరికి వారు తమకు అవకాశం ఇవ్వాలని పార్టీ నాయకత్వంపై ఒత్తిడి తేవడంతో చేసేది లేక రాష్ట్ర అధిష్ఠానం ఓటింగ్ వైపు మొగ్గుచూపింది. జిల్లాలో కీలక నాయకులుగా ఉన్న 15 మంది ఓటు హక్కు ఉన్నది. పది రోజుల క్రితం సంగారెడ్డిలోని పార్టీ కార్యాలయంలో సీక్రెట్ ఓటింగ్ నిర్వహించారు. ఈ ఫలితాన్ని రహస్యంగా షీల్డుకవర్‌లో అదిష్ఠానం వద్ద నిక్షిప్తంగా ఉంచారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలకు ఈ వారంలో అధ్యక్షులను ప్రకటించనున్నారు. ఆ సమయంలో మెదక్ జిల్లా అధ్యక్షుడు ఎవరో తెలియనున్నది. ఓటింగు ద్వారా కొత్త అధ్యక్షుడు ఎవరవుతారనేది ఆ పార్టీలో ప్రస్తుతం హాట్‌టాపిక్ మారింది.

రాబోయే రోజుల్లో మిలిటెంట్ ఉద్యమాలు

సీపీఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి

రైతుకు మద్దతు ధర ఇవ్వాలి: ఎస్. వీరయ్య



7

విద్యార్థులకు ఇంటర్మీడియట్ చాలా కీలకం. ఈ దశలో ఫలితాలు విద్యార్థుల్లో చదవగలమనే నమ్మకాన్ని కలిగించేలా ఉండాలి. ఈ ఫలితాలతోనే పైచదువులకు సరైన పునాది పడుతుంది. ఈ మెట్టుపై విద్యార్థులు తడబడితే తర్వాతి అడుగుల్లో ఉత్సాహం, ఆత్మవిశ్వాసం కొరవడుతుంది. అలాంటి ఇంటర్మీడియట్ ఫలితాల్లో మెదక్ జిల్లా ప్రతీసారి నిరాశ పరుస్తూనే ఉంది. ఉత్తీర్ణత శాతం రాష్ట్రంలోనే అట్టడుగున ఉంటుంది. దీన్ని అధిగమించి ఉత్తమ ఫలితాలను సాధించి, విద్యార్థుల భవితకు బాటలు పరచాల్సిన అవసరముంది.



పరీక్ష రాస్తున్న ఇంటర్ విద్యార్థులు (ఫైల్)

ఇంటర్ ఫలితాల్లో వెనుకబాటు

ఈసారైనా మెరుగయ్యేనా!

ఏటా తగ్గుతున్న ఉత్తీర్ణత శాతం

అట్టడుగున నిలుస్తున్న మెదక్ జిల్లా

పర్యవేక్షణ కరువు... విద్యార్థులపై నిర్లక్ష్యం

మెదక్ అర్బన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి) : ఇంటర్ ఫలితాల్లో ప్రైవేటు జూనియర్ కళాశాలలు కాస్త పర్వాలేదనిపిస్తున్నా, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు మాత్రం క్షీణిస్తున్నాయి. ఎంతో అనుభవం గల అధ్యాపకులు ఉన్నప్పటికీ ఫలితాల సాధనలో ఎందుకు పరుగులు పెట్టలేకపోతున్నాయనే ప్రశ్న తలెత్తుతోంది. లోపం ఎక్కడుంది...? ఎందుకు విద్యార్థులు చదువులో రాణించలేకపోతున్నారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో రోజురోజుకూ ప్రభుత్వ కాలేజీల్లో విద్యా ప్రమాణాలు దిగజారిపోతున్నాయని పలువురు విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఒకప్పుడు సర్కారు కళాశాలలంటే ఎంతో ఆదరణ ఉండేది. ఎంతో మంది ప్రభుత్వ కాలేజీలోనే చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించిన వారు ఉన్నారు. కానీ ఇప్పుడు ప్రభుత్వ కళాశాలంటేనే వామ్మో అని అంటున్నారు. ప్రైవేటు కళాశాలల ఫీజులను భరించలేని వారు మాత్రమే చేరుతున్నారు. అయితే, ప్రభుత్వం ఎన్నో సౌకర్యాలు, ఉచిత ప్రవేశాలు కల్పిస్తున్నప్పటికీ విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడంలో మాత్రం వెనకడుగు వేస్తున్నారు. ఓ పక్క ప్రవేశాలు తగ్గిపోతుండగా చేరిన వారిలోనూ పాస్ అవుతున్న వారి సంఖ్య దారుణంగా పడిపోతుంది. గత రెండేళ్లుగా నమోదవుతున్న ఫలితాలను పరిశీలిస్తే మెదక్ జిల్లా చివరి స్థానాల్లో నిలుస్తోంది. రాష్ట్రస్థాయిలో జిల్లా అట్టడుగున నిలవడం ఆందోళన కలిస్తోంది.

మెరుగువ్వని ఉత్తీర్ణత

ఆరేళ్ల ఇంటర్ ఫలితాలను విశ్లేషిస్తే మెదక్ జిల్లా ప్రదర్శన అథమస్థాయిలో కనిపిస్తున్నది. 2017-18 సంత్సరంలో 6,291 మంది విద్యార్థులకు 3,088 మంది ఉత్తీర్ణత సాధించి, 49 శాతం నమోదు కాగా రాష్ట్రంలో 18వ స్థానంలో నిలిచింది. 2018-19లో 5,780 మందికి 1972 మంది ఉత్తీర్ణులయ్యారు. 34 శాతమే నమోదై, 24వ స్థానంలో నిలిచారు. 2019-20లో 6,040 మందికి 2,818 మంది పాసై, ఉత్తీర్ణత శాతం 47గా నమోదైంది. 33వ స్థానంలో నిలిచారు. 2020-21లో కరోనా కారణంగా ఇంటర్ ఫలితాలు వెలువడలేదు. 2021-22లో ప్రథమ సంవత్సరంలో 6,621 మందికి 2,683 మంది ఉత్తీర్ణత సాధించారు. 40 శాతం నమోదైంది. ద్వితీయ సంవత్సరంలో 5,906 మందికి 2,823 మంది ఉత్తీర్ణత సాధించారు. 47 శాతం నమోదైంది. 2022-23లో ప్రథమ సంవత్సరంలో 6,364 మంది విద్యార్థులకు 2,462 మంది పాస్ కాగా, 38 ఉత్తీర్ణత శాతం నమోదైంది. ద్వితీయ సంవత్సరంలో 5,320 విద్యార్థులకు 2,785 మంది ఉత్తీర్ణత సాధించారు. 52 శాతం నమోదైంది. 2023-24లో ప్రథమ సంవత్సరంలో 5,905 మందికి 2,786 మంది పాస్ కాగా, 47.18 ఉత్తీర్ణత శాతం నమోదైంది. ద్వితీయ సంవత్సరంలో 5,295 మంది పరీక్షలు రాయగా, 3,044 మంది పాస్ కావడంతో 57.48 ఉత్తీర్ణత శాతం నమోదైంది.

కుంటుపడుతున్న విద్యాబోధన

మెదక్ జిల్లా వ్యాప్తంగా 16 ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. ఈ విద్యా సంవత్సరంలో ప్రథమ 6,928 మంది, ద్వితీయ 5,473 మంది విద్యార్థులు ఉన్నారు. రెగ్యులర్ అధ్యాపకులు 129 మంది, 68 మంది అతిథి అధ్యాపకులు, 10 మంది ఒప్పంద, నలుగురు పార్ట్‌టైం, ఒక

మిగతా 8వ పేజీలో

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- నాలుగు విడతల్లో నిర్వహణ
- వచ్చే నెల 3 నుంచి ప్రారంభం
- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 3 నుంచి జరుగునున్న ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో పరీక్షల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు 2024-25 విద్యా సంవత్సరానికి ఫిబ్రవరి 3 నుంచి ఇంటర్ ప్రయోగ పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. నాలుగు విడతల్లో జరిగే పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం, మధ్యాహ్నం రెండుపూటలా నిర్వహించే పరీక్షలకు మొత్తం 12,484 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రయోగశాలల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి లోటుపాట్లు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే, కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశాన్ని డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్ అధికారి శైలజతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వన్ డిస్ట్రిక్ట్ - వన్ ప్రొడక్ట్ జిల్లాలో ఎగుమతి సామర్థ్యాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశాల్లో అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్డీవో శ్రీనివాసరావు, జడ్పీసీఈవో ఎల్లయ్య, అదనపు కలెక్టర్ మెంచు నగేష్, ఇంటర్ నోడల్ అధికారి మాధవి, అధికారులు పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా సింగూరు

అభివృద్ధికి చర్యలు

ప్రాజెక్టు ఐలాండ్‌లో రెస్టారెంట్, ఫుడ్ కోర్టు

29 ఎకరాల్లో ఆధునిక కాటేజీలు

మాస్టర్‌ప్లాన్‌ను సిద్ధం చేయాలి

వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశం



సింగూరు ప్రాజెక్టును పరిశీలిస్తున్న వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

పుల్‌కల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సింగూరు ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయనున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య, శాస్త్ర సాంకేతి శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. పుల్కల్ మండలం సింగూరు ప్రాజెక్టు పరిసరాల్లో సోమవారం టూరిజం, నీటి పారుదల, రోడ్లు భవనాలు, రెవెన్యూ అధికారులతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు. ప్రాజెక్టు అంతర్భాగంలో ఉన్న ఐలాండ్ వాచ్ టవర్‌పైన రెస్టారెంట్, ఫుడ్ కోర్టు, చిల్డ్రన్ ప్లే ఏరియా, ల్యాండ్ స్కేపింగ్, ఆర్ట్ స్కేపింగ్, గార్డెన్‌లను ఏర్పాటు చేయడానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రాజెక్టు దిగువ భాగంలో 29 ఎకరాల్లో రూ.5 కోట్లతో అధునాతన రెస్టారెంట్, 25 ఆధునిక కాటేజీలను నిర్మించాలని, ఇందులోనూ చిల్డ్రన్ ప్లే ఏరియా, ఫుడ్ కోర్టు, గార్డెనింగ్, గ్రీనరీ, పార్కింగ్ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. 50 సీట్ల సామర్థ్యంతో నడిచే రెండు బోట్లు, స్పీడ్ బోట్లను ఏర్పాటు చేయాలన్నారు. పర్యాటకులను ఆకర్షించడమే లక్ష్యంగా మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించాలని టూరిజం, నీటి పారుదల, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులను మంత్రి ఆదేశించారు. కట్టపై బీటీ రోడ్డు నిర్మించాలని మంత్రి సూచించారు. ఆనకట్టపైకి వెళ్లడానికి మెట్లను నిర్మించాలన్నారు. ఆనకట్టపై బండ్, పార్కు, అభివృద్ధి సైక్లింగ్, వాకింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రాజెక్టు పరిసరాల్లో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు ప్రతిపాదనలను ఫిబ్రవరి మొదటి వారంలోగా రూపొందించాలని ఆదేశించారు. ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో పెద్దారెడ్డిపేట చౌరస్తా నుంచి ప్రాజెక్టు వరకు రహదారులు విస్తరించాలని సూచించారు. ఆయన వెంట ఆర్డీవో పాండు, నీటి పారుదల శాఖ ఇంజనీర్లు జైభీమ్, నాగరాజు, మహిపాల్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఇంజనీర్లు రవీందర్, జగదీశ్వర్, పర్యాటక శాఖ అధికారి నటరాజ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, నాయకులు సంగమేశ్వర్‌గౌడ్, మన్నె మధుసూదన్ తదితరులు ఉన్నారు.

బ్రిడ్జి పరిశీలన

మునిపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సింగూరు ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ కారణంగా మునిపల్లి మండల పరిధిలోని తక్కడపల్లి, గార్లపల్లి గ్రామాల మధ్య నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు ఆగిపోయాయి. దీంతో పరిసర ప్రాంతాల వారికి ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న మంత్రి దామోదర్ సోమవారం బ్రిడ్జిని పరిశీలించారు. బ్రిడ్జి పనులను పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఆయన వెంట రాయికోడ్ ఏఎంసీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సతీష్, మాజీ ఎంపీపీ రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

నిద్రలో సార్లు.. లేదంటే సెల్‌ఫోన్‌లో..

వివిధ ప్రాంతాల నుంచి సమస్యలు పరిష్కరించాలని ప్రయాస పడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వినతులను అందజేసేందుకు అర్జీదారులు వస్తుంటారు. అలాంటి చోట అధికారులు నిర్లక్ష్యంగా నిద్రమత్తులో ఉంటున్నారు. మొబైల్ ఫోన్ చూస్తూ గడిపేస్తున్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆశీనులైన సమావేశ మందిరంలోనే వివిధ శాఖలకు చెందిన అధికారులు కునుకు తీయగా, మరికొందరు ఫోన్ చూస్తూ 'ఆంధ్రజ్యోతి' కెమెరాకు చిక్కారు.

\- సంగారెడ్డి జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్(ఆంధ్రజ్యోతి)











మెదక్‌లో 82, సంగారెడ్డిలో 65 అర్జీలు

- ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరించిన అధికారులు

మెదక్ అర్బన్/సంగారెడ్డి రూరల్. జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : మెదక్, సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అర్జీదారులు దరఖాస్తులు అందజేశారు. మెదక్‌లో 82, సంగారెడ్డిలో 65 అర్జీలు అందాయి. మెదక్ కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్వో భుజంగరావుతో కలిసి వినతులను స్వీకరించారు. డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, జడ్పీ సీఈవో ఎల్లయ్య వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ వల్లూరు క్రాంతి అర్జీలను స్వీకరించారు. అదనపు కలెక్టర్‌లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్‌వో పద్మజారాణి, కలెక్టరేట్ ఏవో పరమేశం, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. మెదక్ జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్ వినతులను స్వీకరించి వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఇల్లు ఇవ్వాలని దివ్యాంగురాలి వేడుకోలు



హత్నూర మండలం దౌల్తాబాద్‌లో పూరిగుడిసెలో ఉండే దివ్యాంగురాలు బుచ్చమ్మ పేదరికంతో బతుకీడుస్తున్నది. బుచ్చమ్మ ఇందిరమ్మ ఇంటి కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోగా, గ్రామసభలో నిరాశే మిగిలింది. తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని సోమవారం సంగారెడ్డి ప్రజావాణిలో అధికారులను దీనంగా వేడుకున్నది.

పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగను కలిసిన నాయకులు

శివ్వంపేట /చేగుంట, జనవరి 27(ఆంధ్రజ్యోతి) : పద్మశ్రీ అవార్డు వచ్చిన సందర్భంగా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగను మెదక్ జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు చెట్లపల్లి యాదగిరి ఆధ్వర్యంలో నాయకులు సోమవారం కలిసి ఘనంగా సన్మానించారు. అలాగే చేగుంట మండల ఎమ్మార్పీఎస్ నాయకుడు కొల్పుల రామస్వామి తదితరులు మందకృష్ణను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బడుగు బలహీన వర్గాలకు అభివృద్ధి కోసం పాటుపడుతున్న మందకృష్ణ మాదిగకు అరుదైన గౌరవం దక్కడం సంతోషంగా ఉందన్నారు.



గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఉన్న నందాల మర్రి చెట్టు

తాతల నాటి చెట్టు..!

గ్రామంలో ఏ సభ జరిగినా అక్కడే..

- పంచాయతీ సమావేశాలకూ అడ్డా..
- సినిమా షూటింగ్‌లకు వేదిక

కోహీర్, జనవరి 27, (ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన'గాంధీ తాత చెట్టు'.. సినిమా చెట్టు.. గ్రామం ఇతివృత్తంగా ప్రశంసలు అందుకున్నట్లుగానే సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం పీచేర్యాలగడి గ్రామంలోని నందాల మర్రిచెట్టు చెట్టు చరిత్రగా మారుతోంది. ఎప్పుడు.. ఎవరు నాటారో తెలియదు కానీ, తాము చిన్నపిల్లలుగా ఉన్నప్పటి నుంచి ఆ చెట్టు నీడనే ఆడుకున్నామని ఇప్పటి వృద్ధులు చెబుతున్నారు. మా నాన్న చిన్నతనంలోనూ ఈ చెట్టు ఉందని చెప్పేవాడని గ్రామానికి చెందిన 70 ఏళ్ల తేనెల అంజయ్య చెబుతున్నారు. గ్రామంలో ఏ సభ జరిగినా.. చివరికి పంచాయతీ సమావేశాలూ ఆ చెట్టుకిందనే నిర్వహిస్తారు. మండలంలోని పీచేర్యాగడి గ్రామ పంచాయతీ ముందు ఏళ్ల నాటి మర్రిచెట్టు ఎత్తుగా ఎదిగి, గ్రామస్థులకు చల్లటి నీడను ఇస్తోంది. విశాలమైన కొమ్మలతో విస్తరించిన ఈ చెట్టు కొమ్మలు కొన్ని నరికి వేసినా.. విస్తరిస్తూ నీడను పంచుతోంది. గ్రామ పంచాయతీ ఎదుటే ఉండటంతో కార్యాలయంలో కంటే ఇక్కడ కూర్చునేందుకే సిబ్బంది ఎక్కువ ఇష్టపడుతుంటారు. ఇక పిల్లల ఆటలకు, పెద్దల కాలక్షేప కబుర్లకు ఈ చెట్టు ఓ వేదికగా మారింది. వేసవి కాలంలో అయితే, గ్రామంలోని పెద్దల నుంచి యువకులు, చిన్నపిల్లలు అందరూ ఈ చెట్టు కిందికే చేరుతారంటే అతిశయోక్తి కాదు. ఆ చెట్టు కింద ఎంత సేపు కూర్చున్నా వెళ్ల బుద్ధి కాదని చెబుతుంటారు. అందరూ నందాల మర్రి చెట్టు అని పిలుచుకున్నా.. దానికి ఆ పేరు ఎవరు పెట్టారో కూడా ఎవరూ చెప్పలేకపోతున్నారు.



పీచేర్యాగడి జీపీ ఎదుట ఉన్న మర్రిచెట్టు కింద కూర్చున్న గ్రామస్థులు

మేము పుట్టక ముందు నుంచే..



పీచేర్యాగడి గ్రామపంచాయతీ కార్యాలయం ముందున్న నందాల మర్రిచెట్టు వయసు 150 సంవత్సరాల పైనే ఉంటుంది. మేము పుట్టక ముందు నుంచే ఈ మర్రిచెట్టు గ్రామంలో ఉంది. నా వయసు ప్రస్తుతం 70 సంవత్సరాలు. మా నాన్న చిన్నగా ఉన్నపుడు నుంచే ఈ చెట్టు ఉందని చెప్పేవాడు. గ్రామంలోని ఎవరిని అడిగిన మేము పుట్టక ముందు నుంచే ఇక్కడ చెట్టు ఉందంటారు. గ్రామంలో పంచాయతీ కార్యాలయము నిర్మించక ముందు ఈ చెట్టుకింద పంచాయతీలు, సమావేశాలు నిర్వహించే వారు. - తేనెల అంజయ్య, పీచేర్యాగడి

షూటింగ్‌లకూ..

గ్రామంలోని పెద్ద మర్రిచెట్టు వద్ద పలు సినిమా షూటింగ్‌లు జరిగాయి. ప్రముఖ నటి త్రిష నటించిన నాయకిని సినిమా షుటింగ్‌లో కొంత భాగం ఇక్కడే చిత్రీకరించారు. పలు సినిమాల్లోనూ ఈ చెట్టు కనిపిస్తుంటుంది.

డివైడర్‌ను ఢీకొన్న బైక్..
ఇద్దరు యువకులు మృతి




మైలారం స్వామి, మన్నే సదానందం (ఫైల్)

గజ్వేల్ రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం డివైడర్‌ను ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన గజ్వేల్ పట్టణంలోని ముట్రాజ్‌పల్లిలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ముట్రాజ్‌పల్లి గ్రామానికి చెందిన మైలారం స్వామి(25), సంగుపల్లి గ్రామానికి చెందిన మన్నే సదానందం(27) పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అవివాహితులైన వీరు ఒకే పని చేస్తుండటంతో స్నేహితులుగా మారారు. ఈ క్రమంలో ఒకే బైక్‌పై పనికి వెళ్లి వస్తున్నారు. ఆదివారం రాత్రి పని ముగించుకొని ప్రజ్ఞాపూర్ నుంచి ముట్రాజ్‌పల్లికి వస్తున్నారు. ఈ క్రమంలో మహిళా భవనం వద్దకు రాగానే వీరి బైక్ వేగంగా వెళ్లి అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు.

వ్యాన్ ఢీకొని.. టోల్‌ప్లాజా సెక్యూరిటీ గార్డు మృతి

కొండపాక, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కొండపాక మండలం రాంపల్లి శివారులో సోమవారం ద్విచక్రవాహనంను వ్యాన్ ఢీకొట్టడంతో టోల్ ప్లాజా సెక్యూరిటీ గార్డ్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. రాంపల్లి గ్రామానికి చెందిన నరేందర్‌రెడ్డి (35) టోల్ ప్లాజాలో సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తున్నాడు. విధులు ముగించుకుని గ్రామానికి మోటర్ సైకిల్ పై వెళ్తుండగా రాంపల్లి శివారులో వ్యాన్ ఢీ కొట్టింది. దాంతో తీవ్ర గాయాలైన ఆయన అక్కడికక్కడ మృతి చెందాడు.

సింగరాయ జాతర చూసొద్దామా..

- గుట్టల మధ్య.. గృహాల్లో లక్ష్మీనరసింహుడు
- తూర్పు నుంచి పడమరకు ప్రవహించే సెలయేరు
- శాఖాహార వంటలు.. కాలినడకన వెళ్తేనే దర్శనం
- రేపు జాతర.. ఏర్పాట్లు పూర్తి



సింగరాయ గుట్టల్లో జాతర జరిగే ప్రదేశం



కోహెడ, జనవరి 27 : పచ్చని చెట్లు.. ఎత్తైన కొండలు.. జలజలా పారే సెలయేరు.. పక్షుల కిలకిలరావాలతో ఎటు చూసిన పచ్చదనంతోపాటు తూర్పు నుంచి పడమరకు ప్రవహించే మోయతుమ్మద వాగు.. దీనిపై నిర్మించిన సింగరాయ ప్రాజెక్టు.. ఇలా ఈ ప్రాంతం దేనికదే ప్రత్యేకం. ఇక్కడి సమీపంలోని గృహలో వెలసిన ప్రతాప సింగరాయ(శ్రీ లక్ష్మీ నరసింహస్వామి) జాతరకు వేళయింది. ఏటా పుష్య బహుళ అమావాస్య రోజున (ఈ నెల 29న) జరిగే సింగరాయ జాతరకు అధికారులు అన్ని ఏర్పాటు చేశారు.

కాలినడకన వెళ్తేనే..

కోహెడ మండలంలోని కూరెళ్ల, తంగెళ్లపల్లి, బస్వాపూర్, గుండారెడ్డిపల్లి గ్రామాల మధ్య కొండగుహల్లో వెలిసిన ప్రతాప రుద్ర సింగరాయ (లక్ష్మీనృసింహస్వామి)ని దర్శించుకోవడానికి కాలి బాటనే వెళ్లాల్సి ఉంటుంది. కాకతీయుల కాలంలో సింగరాయ అనే వాస్తుశిల్పి మోయతుమ్మెద వాగుపై ప్రాజెక్టు నిర్మించేందుకు వచ్చి అక్కడే ఉండిపోయడని, అతడి పేరుతోనే ప్రకృతి ఆలయం ఏర్పడిందని ప్రతీక. అప్పటి నుంచి అతడి పేరిట శ్రీ లక్ష్మీనర్సింహస్వామి జాతర జరుగుతుంది. ఇక్కడ తూర్పు నుంచి పడమరకు పారే సెలయేరు ఉండటంతో స్నానలు చేసిన భక్తులు తమ పాపాలు హరించుకుపోవడంతో పాటు చర్మవ్యాధులు నశిస్తాయని నమ్ముతారు. గుండం ఎగువన కొద్ది దూరంలో వాగు పక్కన సోరికే మాదిరిగా ఉన్న ప్రాంతాన్ని సన్యాసుల మఠంగా పిలుస్తారు. ఇందులో అంజనేయ స్వామి కొలువు దీరి ఉన్నారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి నిదర్శించుకునే దారిలోనే చతుర్ముఖ బ్రహ్మ విగ్రహం, ఆంజనేయ (కాల బైరవుడు) స్వామి విగ్రహాలు నెలకొల్పి ఉన్నాయి.

శాఖాహార వంటలు

అన్ని జాతరలకు భిన్నంగా సింగరాయ జాతర ఒకరోజు మాత్రమే జరుగుతుంది. మోయతుమ్మెద వాగులో స్నాలు చేసి, ఎత్తువంపులు గల కొండలు ఎక్కి గుహలో కొలువైన లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకుని.. రాత్రి వరకు ఉంటే స్వామి వారికి తలనొప్పి వస్తుందంటూ మొక్కులు చెల్లించుకుని చీకటి పడకముందే బయలుదేరుతారు. ఈ జాతరలో శాఖాహార వంటలు ప్రత్యేకం. మాంసం, మద్యం, ధూమపానాలు చేయరు. టమాటా, వంకాయ, చిక్కుడు, చారుతో వంటలు చేసుకొని సహపంక్తి భోజనాలు చేస్తారు. కొండ చరియలు, చెట్ల నుంచి వివిధ వన మూలికలను తాకుతూ ప్రవహించే వాగునీటితో చేసిన వంటలు రుచిగా ఉండటమే గాక, సర్వ రోగాలకు దివ్య ఔషధంలా పనిచేస్తాయని భక్తులు నమ్ముతారు.

సస్యరక్షణకు డ్రోన్ల వినియోగం



మందులు పిచికారీ చేస్తున్న డ్రోన్

సిద్దిపేట రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయరంగంలో యంత్రీకరణ కీలకంగా మారిందని, రైతులు పంట సస్యరక్షణకు డ్రోన్‌లను వినియోగించడం పెరిగిందని వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్. శ్రీదేవి అన్నారు. సిద్దిపేట రూరల్ మండలం తోర్నాల వ్యవసాయ పరిశోధన స్థానంలో సోమవారం డ్రోన్‌ల వినియోగంలో రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాగులో సాంకేతికత ఉపయోగించి నూతన వంగడాలు సృష్టించవచ్చునని, డ్రోన్‌లతో పురుగు మందులు పిచికారీ చేయడంతో పాటు, వరినీ విత్తుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.రామ్ గోపాల వర్మ, డాక్టర్ జే. సత్యనారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి టి.రాధిక, ఏడీఏ పద్మ, ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

కూడవెల్లికి నీటిని విడుదల చేయండి

రోడ్డెక్కిన రైతులు



అక్బర్‌పేట బ్రిడ్జి వద్ద ధర్నా చేస్తున్న రైతులు

సిద్దిపేట, జనవరి 27(ఆంధ్రజ్యోతి): కూడవెల్లి వాగుకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని వాగు పరివాహక ప్రాంత రైతులు సోమవారం ఆందోళనకు దిగారు. బ్రిడ్జి వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వాగు పరిసర ప్రాంతాల్లో వరి నాట్లు వేసుకున్న రైతులు కూడవెల్లిలో నీరు లేక నారు ఎండిపోతుందన్నారు. వెంటనే వాగులోకి మల్లన్నసాగర్ ద్వారా కూడవెల్లి వాగులో నీటిని వదలాని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు వచ్చి.. రైతులను సముదాయించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళన విరమించారవు. కార్యక్రమంలో రైతులు భాను, రాంచందర్‌రావు, కృష్ణ, మహేందర్ తదితరులున్నారు.

రాబోయే రోజుల్లో మిలిటెంట్ ఉద్యమాలు

- సీపీఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి
- రైతుకు మద్దతు ధర ఇవ్వాలి: ఎస్. వీరయ్య



విలేకరులతో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య

సంగారెడ్డి రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలపై రాబోయే రోజుల్లో మిలిటెంట్ ఉద్యమాలకు సన్నద్ధమవుతున్నామని సీపీఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి అన్నారు. సీపీఎం రాష్ట్ర మహాసభల సందర్భంగా సోమవారం కొండాపూర్ మండలం మల్కాపూర్ చింతల్‌లో పార్టీ మరో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్. వీరయ్యతో కలిసి విలేకరులతో మాట్లాడారు. నాలుగు రోజుల పాటు జరిగే రాష్ట్ర మహాసభలో రాష్ట్రంలో వివిధ ప్రధాన అంశాలపై చర్చించి ఆయా అంశాలపై తీర్మానాలను ఆమోదించినట్టు తెలిపారు. పేదలకు ఇండ్లు, ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పిన బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించినా పూర్తిస్థాయిలో పేదలకు ఇవ్వలేకపోయిందన్నారు. తమకు ఇళ్లిస్తారని నమ్మి కాంగ్రెస్‌కు ఓట్లేసిన పేదలకు కూడా అన్యాయమే జరిగిందన్నారు. ఎన్నికల ముందు ఇంటి నిర్మాణానికి రూ.6 లక్షలు ఇస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు కేవలం ఐదు లక్షలు ఇస్తామంటున్నారని విమర్శించారు. ఇళ్ల నిర్మాణానికి రూ.10 లక్షలు ఇవ్వాలని మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. ఇంటి స్థలాలు లేని పేదలకు వేలల్లో ఉన్నారని వారికి అన్యాయం చేస్తే సహించబోమని హెచ్చరించారు. భవిష్యత్తులో ప్రజా సమస్యలపై పోరాటాలు చేసేందుకు మహాసభలో తీర్మానించినట్టు ఆమె తెలిపారు.

దేశానికి అన్నం పెట్టే రైతుల సంక్షేమం కోసం, వారికి మద్దతు ధర కల్పించే చట్టం చేసేందుకు బీజేపీ వెనుకడగు వేస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్. వీరయ్య ఆరోపించారు. పేదలను కాంగ్రెస్ ఆదుకుంటుందని అధికారం ఇస్తే మూసీ ప్రక్షాళణ పేరుతో పేదలను రోడ్డుకీడుస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో 1.30 కోట్ల మంది కార్మికులు కనీస వేతనాలకు నోచుకోవడం లేదని, మోదీ కార్మికులకు రోజుకు రూ.178 కూలి ఇస్తే సరిపోతుందని చెప్పడం సిగ్గుచేటన్నారు. కార్మికులకు కనీస వేతనాలు పెంచితే ప్రభుత్వంపై పైసా ఖర్చు పడదని అయినా పెట్టుబడిదారులు, కార్పోరేటర్లకు లాభాలు చేకూర్చేందుకు కార్మికుల పొట్ట కొడుతున్నారు. కనీస వేతనాల ముసాయిదాని విడుదల చేసి రూ.11వేలు ఇస్తే సరిపోతుందని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం విడ్డూరంగా ఉన్నదని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్, రాష్ట్ర కమిటీ సభ్యుడు అడివయ్య తదితరులు పాల్గొన్నారు.

జేఎన్టీయూలో ఒప్పంద అధ్యాపకుల నిరసన



ఇంజనీరింగ్ కళాశాల వద్ద నిరసన తెలుపుతున్న ఒప్పంద అధ్యాపకులు

పుల్‌కల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరించిన తర్వాతే నోటిఫికేషన్ విడుదల చేయాలని ఒప్పంద అధ్యాపకుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఒప్పంద అధ్యాపకులు సోమవారం కళాశాల పరిపాలనా భవనం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఆదివారం జరిగిన కార్యక్రమానికి హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి రిటర్మెంట్ వయస్సును 65కు పెంచుతామని, త్వరలో నోటిఫికేషన్‌కు వెళ్తామని అన్నారని, ఆ వ్యాఖ్యలను స్వాగతిస్తున్నామన్నారు. అయితే, యూనివర్సిటీలనే నమ్ముకుని ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకులపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా ముందుకు వెళ్తే ఆందోళన తీవ్రతరం చేస్తామని ఆ సంఘం నేతలు హెచ్చరించారు. రాష్ట్రంలోని అన్నీ యూనివర్సిటీలలో కలిపి మొత్తం 1,445 మంది ఒప్పంద అధ్యాపకులు పనిచేస్తున్నారని, తమ ఉద్యోగ భద్రతపై ఎలాంటి ప్రకటన చేయకపోవడం బాధకరమన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు డాక్టర్ సాయిచంద్ర, అన్నీ విభాగాల అసిస్టెంట్ ప్రొఫెసర్ కాంట్రాక్టు అధ్యాపకులు పాల్గొన్నారు.



సందడే.. సందడి..

జహీరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. మండలంలోని గోవిందాపూర్ శివారులోని హాటాన్స్ కర్మాగారానికి హైదరాబాద్‌లోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు వచ్చారు. సుమారు 500 మంది విద్యార్థులు బృందాలుగా ఏర్పడి కర్మాగారం కలియదిరిగారు. ఈ సందర్భంగా నిర్వహించిన మేజిక్ షో(ఇంద్రజాల ప్రదర్శన) ఆకట్టుకుంది.



పాతపంటల జాతరలో మాట్లాడుతున్న జాతర కన్వీనర్ వినయ్‌కుమార్

జాడిమల్కాపూర్‌లో పాతపంటల జాతర

జహీరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మొగుడంపల్లి మండలంలోని జాడిమల్కాపూర్‌లో సోమవారం డీడీఎస్ ఆధ్వర్యంలో పాతపంటల జాతరను నిర్వహించారు. మహిళా రైతులు, గ్రామస్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. చిరుధాన్యాలతో అలకంరించిన ఎడ్లబండ్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాత పంటల జాతర నిర్వాహకులు వినయ్‌కుమార్ చిరుధాన్యాల సాగు, వినియోగాన్ని వివరించారు. మారుతున్న ఆహార అలవాట్ల నేపథ్యంలో చిరుధాన్యాలకు, చిరుధాన్యాల ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. డిమాండ్ మేరకు చిరుధాన్యాలను సాగుచేయాలన్నారు. చిరుధాన్యాల సాగును ప్రోత్సహించేందుకు డీడీఎస్ ఆధ్వర్యంలో 30 ఏళ్లుగా ప్రచారం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీడీఎస్ మహిళారైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



పాతపంటల జాతరలో మహిళారైతులు, గ్రామస్థులు

సీఎస్ఆర్ నిధులతో స్కూల్.. అంగన్‌వాడీ కేంద్రం

- కాజీపల్లిలో రూ.2.30 కోట్లతో నిర్మాణం
- ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యే



పాఠశాల ప్రారంభోత్సవంలో ఎంపీ రఘునందన్‌రావు

జిన్నారం, జనవరి 27, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాజీపల్లిలో కెమ్‌టెక్ పరిశ్రమ తన సీఎస్ఆర్ నిధులు రూ.2.30 కోట్లతో నిర్మించిన స్కూల్, అంగన్‌వాడ ఈ భవనాన్ని మెదక్ ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి, విద్యారంగానికి పరిశ్రమలు చేయూత నిర్వాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులు చదివేలా తల్లిదండ్రులు, నాయకులు కృషి చేయాలన్నారు. విద్యారంగ అభివృద్ధికి కెమ్‌టెక్ పరిశ్రమ యాజమాన్యం చేయూతనివ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పరిశ్రమ ఎండీ గోపాలకృష్ణ, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీడీవో అరుణ, మాజీ సర్పంచ్‌లు చీట్ల సత్యనారాయణ, ఆకుల మమత, మాజీ ఎంపీటీసీ భార్గవ, నాయకులు నవీన్, గద్దె నర్సింహ్మా, ఆశోక్, రమాకాంత్ అధికారులు పాల్గొన్నారు.

టీజీ ఐఐసీకి 78 ఎకరాలు అప్పగింత



చెక్కులు పంపిణీ చేస్తున్న అధికారులు

చేగుంట, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడియారం శివారు 307 సర్వే నెంబర్‌లోని 78 ఎకరాల భూమిని రైతుల నుంచి స్వాధీనం చేసుకుని తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌కు అందజేసినట్లు తహసీల్దార్ నారాయణ తెలిపారు. సోమవారం మిగిలిన 20 ఎకరాల 22 గుంటలకు సంబంధించి భూమిని స్వాధీనం చేసుకోని ఎకరాకు రు. 8 లక్షల చొప్పున 24 మంది రైతులకు రూ.ఒక కోటి 70లక్షల 93,748 చెక్కులను పంపిణీ చేశారు. పరిశ్రమల ఏర్పాటు కోసం టీజీ ఐఐసీకి 2016 నుంచి భూ సేకరణ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీజీ ఐఐసీ ఏవో మహ్మద్ నజీద్, తూప్రాన్ ఆర్డీవో కార్యాలయ అధికారి లక్ష్మణ్‌రావు, ఆర్ఐ జైభారత్ రెడ్డి, సర్వేయర్ రవీందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

బీటీ రోడ్ల మరమ్మతులకు రూ.15 కోట్లు

మెదక్ అర్బన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మెదక్ నియోజకవర్గంలో బీటీ రోడ్ల మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.15.10 కోట్ల నిధులు విడుదల చేసినట్లు మెదక్ ఎమ్మెల్యే డా.మైనంపల్లి రోహిత్‌రావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నిధులతో నియోజకవర్గంలోని 30.72 కిలో మీటర్ల రోడ్లకు మోక్షం లభించనున్నట్లు పేర్కొన్నారు.

రాజకీయాలకతీతంగా అభివృద్ధి చేయాలి

● ఎమ్మెల్యే సునీతారెడ్డి

కొల్చారం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : రాజకీయాలకతీతంగా అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి తెలిపారు. సోమవారం కొల్చారం మండలం కిష్టాపూర్ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఆమె భూమి పూజ చేశారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అలాగే లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గౌరీ శంకర్, మాజీ జడ్పీటీసీలు శ్రీనివాస్‌రెడ్డి, సంతోష్, వేమారెడ్డి, బీఆర్ఎస్ మండల యువజన విభాగం అధ్యక్షుడు సంతోష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

నారాయణఖేడ్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): కొత్తగా పట్టా పాసు పుస్తకాలు పొందిన వారు రైతులు ఈ నెల 31 లోగా రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలని స్థానిక ఏడీఏ నూతన్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే రైతుభరోసా పొందుతున్నవారు దరఖాస్తులు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. పట్టా పాసు పుసకం లేదా డిజిటల్ సంతకాలతో ఉన్న డాక్యుమెంట్స్, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం జిరాక్స్ ప్రతులను దరఖాస్తుకు జత చేసి ఏఈవోలకు అందజేయాలని పేర్కొన్నారు.

● నాగల్‌గిద్ద : మండలంలో నూతనంగా 1840 మంది పట్టా పాస్‌బుక్‌లు పొందగా, రైతు భరోసా కోసం ఇప్పటివరకు 92 దరఖాస్తులు వచ్చాయని నాగల్‌గిద్ద ఏవో ప్రవీణ్‌చారి తెలిపారు. మిగతా రైతులు వెంటనే దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు.

యువకుడు అదృశ్యం


రాజు (ఫైల్)

చిలప్‌చెడ్, జనవరి 27(ఆంధ్ర జ్యోతి): యువకుడు అదృశ్యమైన సంఘటన మండలం పరిధిలోని గంగారంలో ఆలస్యంగా వెలుగు లోకి వచ్చింది. సోమవారం పోలీసులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వడ్డె రాజు(27)కు గాజులరామారం కు చెందిన రాణితో వివాహం జరిగింది. వారికి ఒక పాప. దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 20న రాణి తల్లిదండ్రులు ఇంటికి రాగా, మళ్లీ గొడవ జరగడంతో ఆమె తల్లిదండ్రుల వెంట పుట్టింటికి వెళ్లింది. అదేరోజు సాయంత్రం రాజు కూడా ఇంటి నుంచి బయటికెళ్లి తిరిగి రాలేదు. బంధుమిత్రుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో రాజు తండ్రి వడ్డె కిష్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కోహీర్ ఇక మున్సిపాలిటీ

కోహీర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) మేజర్ గ్రామపంచాయతీ కోహీర్ నేటి నుంచి కొత్త మున్సిపాలిటీగా ఏర్పాటు కానుంది. ఈ మేరకు నూతన మున్సిపలిక్ ఇన్‌చార్జి కమిషనర్‌గా ఉమామహేశ్వరరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నారు.

స్వర్ణిమ్ భారత్ పోటీలు

మనోహరాబాద్ జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కూచారం గ్రామంలోని నేహర్ ఐకాన్ యూత్ గ్రంథాలయంలో స్వర్ణిమ్ భారత్, విరాసత్ ఔర్ వికాస్ కార్యక్రమం నిర్వహించారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జీఎమ్ఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ సంయుక్త సహకారంతో నిర్వహించారు. విదార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

అధ్వానం.. వైకుంఠధామం

● నిర్వహణ లేక శిథిలావస్థకు..

● దెబ్బతింటున్న నిర్మాణాలు

● పేరుకుపోయిన చెత్త, పిచ్చిమొక్కలు


తూప్రాన్‌లోని వైకుంఠధామం


బాత్‌రూంలో పేరుకుపోయిన చెత్త చెదారం


పాడైన టాయిలెట్లు

తూప్రాన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): నిర్వహణ లేక తూప్రాన్ పట్టణంలోని వైకుంఠధామం ఎందరూ పనికిరాకుండా పోతున్నది. పెద్దచెరువు సమీపంలో గత ప్రభుత్వం రూ.1.49 కోట్లతో అధునాతన పద్ధతిలో దీన్ని నిర్మించగా, ఏడాది క్రితమే వినియోగంలోకి తెచ్చారు. వైకుంఠధామం నిర్వహణను మున్సిపాలిటీ విస్మరించడంతో అందులోని వసతులన్నీ ధ్వంసమై నిరుపయోగంగా మారుతున్నాయి.

దెబ్బతింటున్న టాయిలెట్లు, గార్డెన్

వైకుంఠధామంలో ప్రజలు నడిచేందుకు వేసిన పార్కింగ్ టైల్స్ పగిలిపోయి గుంతలు ఏర్పడ్డాయి. అందగా ఉండాలని ఏర్పాటు చేసిన గార్డెన్‌లోని మొక్కలకు నీరు పోయడం, కలుపు తీసే నాథుడే లేడు. దీంతో గార్డెన్ పిచ్చి మొక్కలతో కలహీనంగా తయారైంది. శిలాఫలకాన్ని ఎవరో పగలగొట్టి ముక్కలు చేశారు. బాతురూంలు, టాయిలెట్ల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. నల్లాలు దెబ్బతినడంతోపాటు చెత్త చెదారం, మురుగు, పాత సంచులు, దెబ్బతిన్న సిమెంటు బస్తాలతో బాత్‌రూంలు పేరుకుపోయాయి. దీంతో ఇక్కడ దహన సంస్కారాలు చేసేందుకు వచ్చేవారికి కనీస వసతులు లేకుండా పోతున్నాయి. వైకుంఠధామం సర్వంగా సుందరంగా నిర్మించినప్పటికీ నిర్వహణలేక నిర్మాణం దెబ్బతినడంతో కళాహీనంగా తయారైంది. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు వైకుంఠధామంపై దృష్టిపెట్టి పకడ్బందీగా నిర్వహణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మూడు మున్సిపాలిటీలకు ఒకే ప్రత్యేక అధికారి


అమీన్‌పూర్ మున్సిపల్ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరిస్తున్న పాల్గుణ్‌కుమార్

పటాన్‌చెరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు నియోజకవర్గంలోని అమీన్‌పూర్, తెల్లాపూర్, బొల్లారం మున్సిపాలిటీలకు ప్రభుత్వం ప్రత్యేక అధికారిని నియమించింది. మున్సిపల్ శాఖ సీడీఎంఏ జాయింట్ డైరెక్టర్ పాల్గుణ్‌కుమార్ సోమవారం మూడు మున్సిపాలిటీల ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. అమీన్‌పూర్‌లో బాధ్యతలు స్వీకరించిన అనంతరం మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. వచ్చే వేసవిని దృష్టిలో పెట్టుకుని నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వహించకూడదన్నారు. ఇకపై ప్రజా సమస్యలను పరిష్కరించే బాధ్యత మున్సిపల్ సిబ్బంది పైనే ఉందన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు అందిన వెంటనే పరిష్కరించేందుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

అంగన్‌వాడీ భవనాలు పరిశీలించిన సీడీపీవో

కోహీర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) కోహీర్ మండలంలోని పోతిరెడ్డిపల్లి, వెంకటాపూర్, కొత్తూరు(డి), చింతలఘట్టు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను సోమవారం సీడీపీవో, అంజమ్మ, సూపర్‌వైజర్ తులసి పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శిథిలావస్థకు చేరిన అంగన్‌వాడీ భవనాలను గుర్తిస్తున్నట్లు సీడీపీవో తెలిపారు.

ముగిసిన మైత్రీక్లబ్ క్రికెట్ టోర్నమెంట్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : వారం రోజులుగా పటాన్‌చెరు పట్టణంలో మైత్రీ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి టోర్నమెంట్ సోమవారం ముగిసింది. పలు దశల్లో తలపడిన జట్లు హోరాహోరీగా పోరాడాయి. ఫైనల్ మ్యాచ్‌లో ఎస్సార్ ఏ జట్టుపై పటాన్‌చెరు ముదిరాజ్ సీసీ జట్టు ఘన విజయం సాధించి విజేతలుగా నిలిచారు. ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు లక్షన్నర, రెండో స్థానంలో నిలిచిన జట్టుకు లక్ష నగదు బహుమతులు, ట్రోఫీని అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కుమార్‌యాదవ్, మాజీ కార్పొరేటర్లు సపానదేవ్, శంకర్‌యాదవ్, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి, బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, అమీన్‌పూర్ మాజీ జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ ఈర్లదేవానంద్, క్లబ్ అధ్యక్షుడు హన్మంతరెడ్డి పాల్గొన్నారు.

మున్సిపల్ పాలకవర్గ సభ్యులకు ఘన వీడ్కోలు



నర్సాపూర్ మున్సిపల్ పాలకవర్గం వీడ్కోలు సభకు హాజరైన ఎంపీ రఘునందర్‌రావు, ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం విషయంలో ప్రజల కోసం రాజకీయాలకు తావు లేకుండా పనిచేస్తామని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. సోమవారం నర్సాపూర్ మున్సిపల్ పాలకవర్గం వీడ్కోలు సభకు ఎంపీ, ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ నయీం, కౌన్సిలర్లను వారు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాజకీయాలలో రిటైర్‌మెంటు అంటు ఉండదని పదవీ ఉన్నా లేకున్నా నాయకులుగా ప్రజల మధ్యనే ఉంటూ సేవ చేయాలని అప్పుడే వారికి గుర్తింపు మరింత ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ నర్సాపూర్ మున్సిపల్ పాలకవర్గం పట్టణ అభివృద్ధికి చేసిన కృషిని అభినందించారు. కార్యక్రమంలో కమిషనర్ రామకృష్ణరావు, మేనేజర్ మధుసూదన్, జూనియర్‌అసిస్టెంటు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. పెండింగ్ స్కాలర్‌షిప్పులు, ఫీజు రియంబర్స్‌మెంటు ఇప్పించేందుకు కృషి చేయాలని కోరుతూ ఎంపీ, ఎమ్మెల్యేలకు స్థానిక ఎల్లంకి కళాశాల విద్యార్థులు వినతిపత్రం అందజేశారు.

● సంగారెడ్డి టౌన్ : సంగారెడ్డి గ్రేడ్ వన్ మున్సిపల్ పాలకవర్గ సభ్యుల పదవీకాలం ముగియడంతో సోమవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కమిషనర్ ప్రసాద్ చౌహాన్ ఆధ్వర్యంలో చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మి దంపతులతో పాటు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులకు శాలువాలు, పూలమాల తో సన్మానించి, జ్ఞాపికాలను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్, డీఈ ఇంతియాజ్ అహ్మద్, మేనేజర్ సూర్య ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలి : పీఆర్టీయూ

న్యూస్ నెట్‌వర్క్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ 1 నుంచి యునైటెడ్ పెన్షన్ స్కీం అమలు చేయాలని యోచిస్తుందని, దీన్ని విరమించుకుని పాత విధానాన్నే కొనసాగించాలని పీఆర్టీయూ నేతలు కోరారు. ఈ మేరకు డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా వ్యాప్తంగా మండల కార్యాలయాల్లో అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం యునైటెడ్ పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలపై కూడా ఒత్తిడి తెచ్చే అవకాశం ఉందని, అందువల్ల ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతారన్నారు. పునరాలోచించి పాత విధానమే అమలయ్యేలా కృషి చేయాలని కోరారు.

పాదయాత్రగా తరలివెళ్లిన మాజీ సర్పంచ్

ఝరాసంగం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మేదపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పరమేశ్వర్ పాటిల్ ఆధ్వర్యంలో యువకులు సోమవారం రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసేందుకు ఎర్రవల్లి ఫాంహౌస్‌లో పాదయాత్రగా వెళ్లారు. జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు, డీసీఎంఎస్ చెర్మన్ మాల్కాపూరం శివకుమార్ ఈ పాదయాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ట్రైనీ కలెక్టర్ మనోజ్‌కు వినతి పత్రం అందజేస్తున్న లబ్ధిదారులు

నష్ట పరిహారం అందజేయాలి

ఝరాసంగం, జనవరి 27(ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని చీలపల్లి గ్రామ శివారులోని సర్వే నెంబరు 112, 125,126, 148, 103 లో సుమారు 36 ఎకరాలకు సంబంధించి నిమ్జ్ నష్టపరిహాం అసలైన వారికి అందలేదని ఆ గ్రామ రైతులు మహబూబ్ పాటిల్, శ్రీకాంత్ రెడ్డి, చంద్రయ్య, ఈరన్న, సంగన్న, వెంకటేషం, నరేష్‌లు వాపోయారు. సోమవారం మండల కేంద్రమైన ఝరాసంగంలోని తహసీల్దార్ కార్యలయంలో ట్రైనీ కలెక్టక్ మనోజ్‌కు వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ భూములకు సంబంధించిన నిమ్జ్ పరిహారం ఇప్పటి వరకు తమకు అందలేదన్నారు. నష్టపరిహారం అందేంతా వరకు భూముల కబ్జాలో నుంచి వెళ్లే ప్రసక్తే లేదన్నారు. సరైన రైతులను గుర్తించకుండా అప్పటి అధికారులు వారి ఇష్టానుసారంగా నష్టపరిహారం అందజేశారన్నారు. అసలైన రైతులను గుర్తించి తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

సంగారెడ్డి అర్బన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం సంగారెడ్డి ఎమ్మెల్యే చింతాప్రభాకర్ లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు.

● నారాయణఖేడ్ : నిజాంపేట మండలం రాంరెడ్డిపేటకు చెందిన మాజీ సర్పంచ్ భూమయ్యకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.2లక్షల ఎల్‌వోసీ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి సోమవారం అందజేశారు.

తారా కళాశాల విద్యార్థుల క్షేత్ర పర్యటన

సంగారెడ్డి అర్బన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని తారా కళాశాల విద్యార్థులు క్షేత్ర స్థాయి పర్యటనకు సోమవారం తరలివెళ్లారు. కళాశాల బిజినెస్ మేనేజ్‌మెంట్, కామర్స్ విభాగాల విద్యార్థులు క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా మేడ్చెల్‌లోని మహాలక్ష్మీ ప్రొఫైల్స్ కంపెనీని సందర్శించారు. "కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రత్నప్రసాద్, అధ్యాపకులు కరుణ, శ్యాంసుందర్, నందిని, దీపిక, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఏబీవీపీ ఖేలో భారత్ క్రీడోత్సవాన్ని సోమవారం నిర్వహించారు.

కేంద్ర బడ్జెట్‌లో కార్మిక వర్గానికి ప్రాధాన్యతనివ్వాలి

సంగారెడ్డి అర్బన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఫిబ్రవరి 1 న కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టే కేంద్ర బడ్జెట్‌లో కార్మిక వర్గానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని భారతీయ మజ్దూర్ సంఘ్ ప్రతినిధులు కోరారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కుసోమవారం ఢిల్లీలో వినతిపత్రం అందజేశారు. జాతీయ ప్రధాన కార్యదర్శి రవీంద్ర, జిల్లా కార్యదర్శి మోహన్‌రెడ్డి , సంఘటన కార్యదర్శి సురేంద్రన్, నార్త్‌జోన్ ఇన్‌చార్జి పవన్‌కుమార్ పాల్గొన్నారు.

చౌటకూర్ జీపీ భవనంలోకి ఎంపీడీవో కార్యాలయం


భవనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో ఆనందమేరీ

పుల్‌కల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండల పరిషత్ కార్యాలయం గ్రామ పంచాయతీ భవనంలో కొనసాగనున్నది. ఈ మేరకు సోమవారం ఎంపీడీవో ఆనందమేరీ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నత్తి దశరత్ జీపీ భవనాన్ని పరిశీలించారు. గ్రామ పంచాయతీ కార్యకలాపాలు పాత జీపీ భవనంలో కొనసాగనున్నాయి. ఈ నెల 30న నూతన మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగనున్న దృష్ట్యా మండలానికి అవసరమైన అధికారులు, సిబ్బందిని సైతం కేటాయిస్తున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సందీప్‌గౌడ్, కారోబార్ జాఫర్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కలాలి రామగౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడు వర్కల రమేశ్, నాయకులు సార గోవర్ధన్‌ముదిరాజ్, ప్రభాకర్‌రెడ్డి, కైసర్, చంటి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'ఆర్డినరీ బస్సులను నడపాలి'


రాస్తారోకో చేస్తున్న సిరిపుర గ్రామస్థులు

హత్నూర, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్-జోగిపేట్ రూట్‌లో ఎక్స్‌ప్రెస్ బస్సులను రద్దు చేసి ఆర్డినరీ బస్సులను నడపాలని డిమాండ్ చేస్తూ సిరిపుర గ్రామస్థులు ఆందోళనకు దిగారు. దౌల్తాబాద్-జోగిపేట రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. ఎక్స్‌ప్రెస్ బస్సులు గ్రామ బస్టాప్ వద్ద నిలుపకపోవడంతో విద్యార్థులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయాన్ని ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదన్నారు. ఇప్పటికైనా స్పందించి ఆర్డినరీ బస్సులను పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాజీ ఉపాధ్యక్షుడు చిన్న నర్సింహులు, మాజీ సర్పంచ్ మచ్చ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష పుష్పార్చన


భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తున్న మాధవానంద సరస్వతీస్వామి

కంగ్టి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కంగ్టిలోని రామాలయంలో సోమవారం సామూహిక లక్ష పుష్పార్చనను ఘనంగా నిర్వహించారు. మాధవానంద సరస్వతీ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే సతీమణి అనుపమారెడ్డి పాల్గొన్నారు. దెగ్లూర్ గుండా మహారాజ్‌పీఠాదీశ్వరులు చంద్రశేఖర్ మహారాజ్‌కు భక్తులు పాదపూజ చేశారు. భక్తులకు మాధవానంద సరస్వతీ స్వామి అనుగ్రహ భాషణం చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో నిర్వాహకులు కోటగిరి వినోద్, గణేష్ కుమార్, అశోక్ మహారాజ్, అక్షయ్ మహారాజ్, అజయ్ మహారాజ్, నర్సింహాచారి, వెంకట్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బాలల రక్షణపై అవగాహన


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్ఐ శ్రీశైలం, అధికారులు

నారాయణఖేడ్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): లింగ వివక్ష నిర్మూలన కోసం బేటి బచావో, బేటి పడావో కార్యక్రమం చేపడుతున్నట్లు ఎస్ఐ రాసుల శ్రీశైలం అన్నారు. సోమవారం నారాయణఖేడ్ శివారులోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాలల హక్కుల రక్షణకు ప్రత్యేక చట్టాలు, హెల్ప్‌లైన్‌లు ఉన్నాయన్నారు. బాలబాలికలు ఎలాంటి సమస్యలున్నా 100, 101, 108, 1098 నంబర్లకు సమాచారం అందించాలన్నారు. సైబర్ నేరాలు, మద్య, ధూమపానంతో కలిగే అనార్థాలను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ పల్లవి, పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ జమున, మహిళా సాధికారిత కేంద్రం, ఫైనాన్షియల్ స్పెషలిస్ట్ నర్సింహులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గద్దర్‌కు అవార్డు ఇవ్వకపోవడం దుర్మార్గం

● ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి

పటాన్‌చెరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఉద్యమ నౌక గద్దర్‌కు పద్మ అవార్డు ఇవ్వాలని ప్రభుత్వం సిఫారసు చేసినా కేంద్రం పట్టించుకోకపోవడం దారుణమని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి విమర్శించారు. సోమవారం ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి పటాన్‌చెరులో విలేకరులతో మాట్లాడారు. కేవలం రాజకీయ కక్షతోనే తెలంగాణ ప్రతిభావంతులు, సమాజ సేవకులకు పద్మ అవార్డులను అందజేయలేదన్నారు. అత్యంత పారదర్శకంగా ఇవ్వాల్సిన ఈ అవార్డుల్లో రాజకీయ కోణాలను చూడటం బీజేపీ నాయకులకే చెల్లిందన్నారు. పేదల పక్షాన పోరాడిన గద్దర్‌పై తీవ్రవాద ముద్ర వేయడం బీజేపీ నేతల దివాళాకోరుతనానికి నిదర్శనమన్నారు. గద్దర్‌పై కేంద్రమంత్రి బండి చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని క్షమాపణలు చెప్పాలన్నారు.

ఇంటర్ ఫలితాల్లో వెనుకబాటు

(5వ పేజీ తరువాయి)

ఎయిడెడ్ లెక్చరర్ పని చేస్తున్నారు. జిల్లాలోని ఆయా ప్రభుత్వ కళాశాలల్లో రోజువారి విద్యాబోధనలో విద్యార్థుల గైర్హాజరు పెరుగుతోంది. దీనికి తోడు లెక్చరర్ల గైర్హాజరు కారణం ఉందని ఆరోపణలున్నాయి. ప్రణాళికబద్ధంగా సిలబస్‌ను పూర్తి చేయకపోవడం కొన్ని కళాశాల్లో కొనసాగుతుందని సమాచారం. అలాగే కళాశాలలపై పర్యవేక్షణ లేక విద్యాబోధన కుంటుపడుతున్నది. ప్రతీ ఏటా నమోదవుతున్న ఫలితాల్లో వెనుకబడుతున్న కళాశాలలపై ప్రత్యేక దృష్టి సారించి సరైన నిర్ణయాలు తీసుకుంటే మెరుగైన ఫలితాలు నమోదవుతుండేవి. ఈ పరిస్థితుల్లో మార్పు తీసుకురావాల్సిన అవసరమున్నది.

ప్రత్యేక దృష్టి సారించాం

ప్రభుత్వ కళాశాలల్లో మంచి ఫలితాలు తీసుకొచ్చేందుకు ప్రత్యేక దృష్టి సారించాం. విద్యార్థులను ఏ, బీ, సీ, డీ కేటగిరీలుగా విభజించాం. సీ, డీ గ్రూపు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం. ప్రతీ లెక్చరర్‌కు యాక్షన్‌ప్లాన్ రూపొందించి, ప్రణాళికబద్ధంగా స్పెషల్ క్లాసులను కొనసాగిస్తున్నాం. ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం.

- మాధవి, ఇంటర్ జిల్లా ఇన్‌చార్జి నోడల్ అధికారి, మెదక్

మా డబ్బులు.. కాంట్రాక్టర్‌కు ఎలా ఇస్తారు?

● న్యాయం చేయాలని మత్స్యకారుల వినతి


కలెక్టరేట్ వద్ద మత్స్యకారులు

సంగారెడ్డి రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : తమ ఖర్చుతో పనులు చేపడితే.. కాంట్రాక్టర్‌కు బిల్లులు ఎలా చెల్లిస్తారని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు నగేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో ప్రజావాణికి వచ్చి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. సంగారెడ్డిలోని మహబూబ్‌సాగర్ చెరువులోని గుర్రపు డెక్కను మున్సిపల్ అధికారులు జేసీబీతో కొన్ని రోజులు మాత్రమే తొలగించారన్నారు. దీంతో మత్స్యకారులమంతా కలిసి రూ.14 లక్షల వరకు ఖర్చు చేసి పూర్తిగా తొలగింపజేశామన్నారు. కానీ దీనికి సంబంధించిన బిల్లులు కాంట్రాక్టర్‌కు ఇచ్చారని మండిపడ్డారు. తమకు డబ్బులు ఇప్పించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో అశోక్, శ్రద్ధానంద్, రాజేష్, రాఘవేంద్ర, వంశీ, జీ.నగేష్ తదితరులు ఉన్నారు.

చదివిన బడిని మరవద్దు

వైద్య శాస్త్రవేత్త మన్నె ఉపేందర్


మాట్లాడుతున్న శాస్త్రవేత్త ఉపేందర్

పాపన్నపేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): చదివిన బడిని ఎప్పటికీ మరవద్దని పాపన్నపేట పాఠశాల పూర్వపు విద్యార్థి, వైద్య శాస్త్రవేత్త ఉపేందర్ విద్యార్థులకు సూచించారు. సోమవారం పాపన్నపేట ఉన్నత పాఠశాలలో తన సొంత ఖర్చుతో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని తన సతీమణి వందనతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తాము సంపాదించుకున్న ఆస్తుల్లో ఎంతో కొంత సమాజ సేవకు వినియోగించాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఆయన రూ.2 లక్షల వ్యయంతో లైబ్రరీ ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థులు, స్థానికులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ప్రతాప్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహేశ్వర్, పాఠశాల చైర్మన్ భవాని, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, విశ్రాంత మండల విద్యాధికారి మోహన్ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.